## క్లుప్తంగా

### బొమ్మాయిపల్లెలో పొలంబడి

బంగారుపాళెం: రైతు భరోసా కేంద్ర సిబ్బంది సాగుపద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి పద్మజ అన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లె ఆర్‌బీకే పరిధిలోని బొమ్మాయిపల్లెలో శనివారం సిబ్బందికి పొలంబడిపై శిక్షణ నిర్వహించారు. వరి సాగులో కాలిబాట విధానం, శత్రు, మిత్ర పురుగుల గుర్తింపు, సాగులో ఎరువుల యాజమాన్య పద్ధతులను ఎలా అవలంబించాలి, కలుపు మొక్కల నివారణ, 25 శాతం ఆకులు కత్తిరింపు వల్ల కలిగి ప్రయోజనాలు, ఇంటిగ్రేటెడ్ పంటల్లో యాజమాన్య పద్ధతులపై ఏఓ అవగాహన కల్పించారు. పంటల సాగుకు సంబంధించి ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలోనూ సిబ్బంది పంట పొలాలను సందర్శించి రైతులకు సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాదరయ్య, మండలంలోని ఆర్‌బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

### పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

యాదమరి: పరిసరాల శుభ్రతపై గ్రామీణ ప్రజలకు స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు అవగాహన కల్పించారు. ఉదయం మండలంలోని ఆరిమాకుల పల్లెలో గ్రామీణ ప్రజలకు మలేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాప్తి చెంది దాడులు చేస్తాయన్నారు. దోమ కాటు వలన మలేరియా, అంటు వ్యాధులు, విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### క్యాన్సర్ నివారణకు ప్రతిజ్ఞ




గుడిపాల: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్ అన్నారు. సీఎన్‌ఆర్ కళాశాలలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ రావడానికి కారణం తీసుకొనే ఆహార పదార్థాలు, శీతల పానీయాలేనని చెప్పారు. పొగతాగడం, గుట్కా, గంజాయి, పొగాకు, మద్యపానం వల్ల క్యాన్సర్ వస్తుందన్నారు. అనంతరం క్యాన్సర్ నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లోకేష్, ప్రిన్సిపాల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, కమ్యూనిటీ హెల్త్ అధికారి నరసింహమూర్తి, నర్సింగ్ సిబ్బంది హేమలత, విజయ, లక్ష్మీపతి పాల్గొన్నారు.

### ఆస్పత్రుల్లో పింఛన్ పంపిణీ

పూతలపట్టు: మండలంలో తేనేపల్లికి చెందిన బి.సావిత్రమ్మ, అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ జయప్రకాష్ ఆసుపత్రికి వెళ్లి ఆ మహిళకు పింఛన్ రూ.2,750 అందజేశాడు.

**తిరుపతికి వెళ్లి ..**



బంగారుపాళెం: అనారోగ్యంతో తిరుపతిలో చికిత్స పొందుతున్న దివ్యాంగ బాలుడికి శనివారం వలంటీరు పింఛన్ అందజేశాడు. మండలంలోని తగ్గువారిపల్లెకు చెందిన బాలుడు స్వరూప్‌కుమార్ అనారోగ్యానికి గురి కావడంతో సభ్యులు తిరుపతిలో స్విమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. వలంటీరు వంశీకృష్ణ తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేశాడు.



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



సమావేశానికి హాజరైన గృహసారథులు, పంచాయతీ కన్వీనర్లు

# సంక్షేమ పథకాలతోనే ఆర్థికాభివృద్ధి

- ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: అర్హులైన పేదలు సంక్షేమ పథకాలతోనే ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మరకాలకుప్పం పంచాయతీలోని చామంతిపురం, నాగేంద్రపురం, మరకాలకుప్పం కాలనీ, ఎస్టీ కాలనీలలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందడం వల్ల కలిగిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు పాలన చేరువ చేశారన్నారు. గ్రామంలో అవసరమైన వసతులు, సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్నామని వివరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాలను సకాలంలో అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధిని నేరుగా అందజేస్తున్నామన్నారు. గతంలో సిఫార్సులు ఉంటేనే పథకాలు వచ్చేవని, అదే జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఇళ్లవద్దకే వస్తాయన్నారు. ప్రతినెలా 1వ తేదీన పెన్షన్ అందజేయడమే అందుకు ఉదాహరణ అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు జనార్దన్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాయి ప్రసాద్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, రజినీకాంత్, గుణవతి, జయకోడి, రవి, భాస్కర్, ప్రవీణ్, విక్టర్, సిలంబరసన్, ఈశ్వర్‌రెడ్డి, సామ్‌వెల్‌బాబు, ప్రతాప్‌రెడ్డి, రమణ, కుమార్, కారిమేఘన్‌తోపాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

**జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం**

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. వసంతాపురం సచివాలయ పరిధిలో శనివారం మండల సచివాలయ కన్వీనర్ సాయి ఆధ్వర్యంలో ఏడు సచివాలయాలకు సంబంధించి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహసారథులుగా ఎంపికైన వారు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమన్వయం చేసుకొని ప్రతి ఇంటికీ వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని వివరించాలన్నారు. వారి సమస్యలు తెలుసుకొని మండల ఇన్‌చార్జుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి 50 గడపలకు ఇద్దరు గృహసారథులు, ఒక వలంటీర్‌ను నియమించామన్నారు. కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి వారి అనుమతితో 'మా నమ్మకమే నువ్వు జగనన్న' అనే స్టిక్కర్ అతికించాలని గృహ సారథులకు సూచించారు. అనంతరం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల విధులు, బాధ్యతల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు క్రిష్టారెడ్డి, రజినీకాంత్, రెడ్డప్ప, గోపి, డానియల్, చిట్టిబాబు, సుధాకర్ నాయుడు, శ్రీధర్‌రెడ్డి, మణి, సంపత్, సామ్‌వేల్‌లు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం చిత్తూరు, అరగొండ అపోలో నర్సింగ్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సూత్రాలు, పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమం ఆకట్టుకుంది. అధ్యాపకులు దేవిప్రియ, కార్యక్రమ నిర్వాహకులు శోభారాణి, బేబి తదితరులు గర్భిణులు, విద్యార్థులకు ప్రదర్శనలోని బోర్డులు, పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలపై చక్కగా వివరించారు. ఆస్పత్రి పర్యవేక్షకులు వరలక్ష్మి, పద్మజ, శేషసాయి, జయంతి, లోకేశ్వరి పాల్గొన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

గుడిపాల: మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉపేంద్ర తెలిపారు. దీనికి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరవుతున్నారని చెప్పారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

## తుక్కు వస్తువుల వేలం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ వాహనాల షెడ్ ప్రాంగణంలో ఉన్న తుక్కు వస్తువులకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. నగరపాలక సంస్థకు చెందిన వాహనాల షెడ్ ప్రాంగణంలో ఉన్న నీటి సరఫరాకు సంబంధించి పాత మోటర్లు, పాత ట్యూబ్లైట్ ఫ్రేములు, వివిధ రకాల పాత వస్తువులు, పాత చెక్క సామాగ్రి, తుప్పు పట్టిన ఇతర ఇనుప సామాగ్రిని శనివారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో వేలంపాట నిర్వహించారు. వేలంపాట కోసం ముందుగా 25 మంది నగదు చెల్లించి షెడ్యూల్ పొందగా, 21 మంది డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నట్లు ఎంఈ ధనలక్ష్మీ తెలిపారు. పాత వస్తువులకు తూకం ద్వారా మొదటి ప్రారంభ విలువ రూ.25,66,074గా నిర్ణయించి వేలంపాట నిర్వహించారు. చివరగా బాలాజీ లక్ష్మీ మెటల్ మార్ట్ వారు రూ.25,97,074 కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ ఎస్.అముద, సహాయ కమిషనర్ గోవర్ధన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, సహదేవన్, డీఈ వెంకట ప్రసాద్, ఎంఈలు శ్రీలత, వెంకటరత్నం పాల్గొన్నారు.

## తీరు మారని జిల్లా ఆస్పత్రి



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అడుగు పెట్టిన వెంటనే చిందరవందరగా పడిన మాత్రలు, పత్రాలు, కోవిడ్ కిట్లు, సిరప్‌డబ్బాలు కనిపిస్తున్నాయి. కొన్ని నెలలుగా ఇలానే కనిపిస్తున్నా ఒక్క అధికారీ పట్టించుకోవడంలేదు. ఈ క్రమంలో ఆ ప్రాంతం చెత్త కుండీని తలపిస్తోంది. - చిత్తూరు రూరల్

## జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థిని



లాస్యను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని మురకంబట్టులో ఉన్న ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సాంద్రా లాస్య నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు లాస్య హాజరైంది. ఆ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి బెస్ట్ అవుట్ స్టాండింగ్ అవార్డును లాస్య గెలుచుకోవడంతో శనివారం ఆ పాఠశాలలో విద్యార్థినికి అభినందన సభ నిర్వహించారు. జాతీయ స్థాయి నుంచి అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన లాస్య త్వరలో యూఎస్ఏలో నిర్వహించే పోటీలకు హాజరుకానుంది.

# లోకేష్... మాట్లాడడం నేర్చుకోవయ్యా!

- గ్రామాల్లో చిచ్చు పెట్టేందుకా ఈ యాత్ర
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పూతలపట్టు(యాదమరి): ''అయ్యా లోకేష్ బాబూ.. మొదట మాట్లాడడానికి నేర్చుకో, అలాగే నిజాలు తెలుసుకో కావాలంటే పాదయాత్ర మళ్లీ చేసుకోవచ్చు.'' అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే, నియోజకవర్గ నాయకులతో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అడ్డదారిలో మంత్రి అయిన చంద్రబాబు పుత్రుడు నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలోకి వచ్చారని చెప్పారు. ఆయన చట్టాలను గౌరవించక నోటికొచ్చినట్లు మాట్లాడుతుండడం చూస్తుంటే ఆయన ప్రజల కష్టాలను చూడడానికి కాదు. గ్రామాల్లో చిచ్చు పెట్టేందుకే వచ్చారని విమర్శించారు. లోకేష్ ప్రభుత్వం మీద, తన మీద లేనిపోని ఆరోపణలు చేశారని, వాటిని నిరూపించాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

**కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా?**

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆయన పునర్నిర్మాణానికి ఎన్ఆర్‌ఐలు సాయం చేశారని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి తెలిపారు. అందులో ఎమ్మెల్యే కమిషన్ తీసుకున్నారని లోకేష్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీరినూ కాణిపాక వినాయక స్వామి దర్శనార్థం ఆదివారం వస్తున్న లోకేష్, ఆలయంలో ప్రమాణం చేస్తారా అని ఆలయ చైర్మన్ డిమాండ్ చేశారు లోకేష్ కనీసం వార్డు సభ్యునిగా అయినా గెలిచి పాదయాత్ర చేస్తే బావుండేదని సీనియర్ నాయకులు తలపుల పల్లె బాబు రెడ్డి, పట్నం ప్రతాప్‌రెడ్డి హితవు పలికారు.

### అమర రాజా ఫ్యాక్టరీని సందర్శించిన ఎస్పీ

బంగారుపాళెం: అమర రాజా గ్రోత్ కారిడార్‌ను శనివారం సాయంత్రం జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి సందర్శించారు. ఆరు రోజుల క్రితం ఫ్యాక్టరీలో బ్యాటరీలకు సంబంధించిన యూనిట్‌లో అగ్ని ప్రమాదం సంభవించి భారీ నష్టం సంభవించింది. అగ్ని ప్రమాదానికి గురైన యూనిట్‌ను పరిశీలించారు. ప్రమాదం గురించి ఫ్యాక్టరీ నిర్వాహక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేడు పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు సుదర్శనహోమం, రాత్రి 8 గంటలకు ప్రాకారోత్సవం ఉంటుందన్నారు.

### పోస్టర్ల విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించే ఏపీ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ పోటీల పోస్టర్లను చెస్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం విడుదల చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్ ఆర్‌బీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ పోటీల్లో విద్యార్థులు, పెద్దలు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు రూ.62,600, ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్స్ ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు 9949515058ను సంప్రదించాలని కోరారు.

## ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

ఐరాల: ఆయుష్మాన్ భారత్‌పై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, సచివాలయ ఉద్యోగులు తమవంతు కృషి చేయాలని ఎంపీడీఓ నిర్మలాదేవి సూచించారు. మండలంలోని వేదగిరివారిపల్లె సచివాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ (అబా) కార్డు పొందిన వారికి కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తారని తెలిపారు. వలంటీర్ మ్యాపింగ్ అనంతరం వైద్యశాఖ లాగిన్‌లో ఈ కార్డు రూపొందిస్తారన్నారు. చాలాచోట్ల లాగిన్ కానందున, అవగాహన లేకపోవడంతో వీటి నమోదు బాగా తక్కువగా ఉందన్నారు. వివాహం చేసుకొన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వివాహ ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు. ఆ పత్రం ఉంటేనే రేషన్‌కార్డులో పేరు నమోదుకు వీలవుతుందని తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి సచివాలయాల్లోనే వివాహ ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వివాహం చేసుకున్న రెండు నెలల్లోపు అయితే సచివాలయంలోనే వివాహ ధ్రువీకరణ పత్రం పొందవచ్చన్నారు. అంతకుమించితే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అయ్యప్పగారిపల్లి లే అవుట్ పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని అయ్యప్పగారిపల్లి లేఅవుట్‌లను పరిశీలించారు. ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలకు అవసరమైన బిల్లులను ప్రభుత్వం సకాలంలో అందిస్తోందని చెప్పారు. లబ్ధిదారులతో మాట్లాడి పూర్తి చేయించే బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లపైన ఉందని అన్నారు. కార్యక్రమంలో డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో తైపూస పూజలు



పాలబిందెలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీవళ్లి దేవయాని సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం తైపూస పూజలను కాలభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని పాలబిందెలతో ఊరేగింపుగా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మూలస్థానంలోని స్వామి వారికి అభిషేకం చేయించారు. ట్రస్టు చైర్మన్ వెంకటేశన్ కంకణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## చిరుధాన్యాలపై మహిళలకు అవగాహన



మహిళా రైతుల సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్



మామిడిపంట పూతను పరిశీలిస్తున్న ఉప సంచాలకులు

గుడిపాల : చిరుధాన్యాల సాగుపై మహిళా రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు గోపాల్ అన్నారు. 189 కొత్తపల్లెలో శనివారం మహిళా రైతులకు చిరుధాన్యాల పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తులు, వాటి విలువ, వాటి విలువ ఆధారిత పెంపుదల, స్వయం ఉపాధికల్పనపై వారికి వివరించారు. చీడపీడల నివారణపై సమగ్ర సస్యరక్షణ విధానాలపై క్షేత్ర పర్యటన చేసి రైతులకు వివరించారు. చిరుధాన్యాల సాగుతో పర్యావరణ పరిరక్షణ, సుస్థిర దిగుబడులు పొందవచ్చని మహిళా రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.



రైతుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

**మహిళా రైతులకు శిక్షణ**

పూతలపట్టు: మండలంలోని వేపనపల్లి రైతు భరోసా కేంద్రంలో శనివారం వ్యవసాయశాఖ తరపున మహిళా రైతులకు ఉచిత శిక్షణ నిర్వహించారు. దీనికి హాజరైన జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్ బాషా మాట్లాడుతూ మహిళారైతులు చిరుధాన్యాల ఉత్పత్తిలోనూ కీలక పాత్ర పోషించాలని తెలిపారు. అనంతరం కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన రెడ్డి, జిల్లా వనరుల కేంద్ర అధికారి లక్ష్మీప్రసన్న, మండల వ్యవసాయాధికారి మధురవాణి, రైతులు పాల్గొన్నారు.

### వరసిద్ధి వినాయక స్వామి సేవలో..

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమా చక్రవర్తి కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇంతకుముందు వారికి ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో ఆలయ ఈఓ, అధికారులు